
# విధివిలాసం

వై. నరసింగరావు



ఆడదాని అందం ఈ మగవాళ్ళ మనస్సులకు బంధం వేస్తుందంటారు. అది నిజమేనేమో కాని, ఆ అందాన్ని సొంతం చేసుకోటానికై తను నేర్చిన విద్యలలో ఏదో ఒక విద్యను ప్రదర్శించి తన వైపు త్రిప్పుకోవటానికి ప్రయత్నించటం ఈ రోజుల్లో వింత వేటగ తయారయింది" అంటూ నవ్వ సాగింది.

"అయితే ఈ చిత్రాల ప్రభావం నీ మీద ఏమాత్రం ప్రయోగింపబడ లేదా?" ఆశ్చర్యంగా చూసింది.

"ప్రయోగింపబడలేదు!" అని నొక్కి నొక్కి పలికింది లలిత.

నిర్మల ఏదో అనబోయి ముభావంగా వుండిపోయింది.

"ఇంతవరకూడ పూర్తిచేయని మనం ఈ చిలిపి కోర్కెలకు లొంగిపోయి

"'ప్రేమ' అంటూ పిచ్చి పిచ్చి ఆలోచనలతో మనస్సును పోగొట్టుకుంటే ముందు భవిష్యత్‌ను చేజేతులా నాశనం చేసుకున్నవారమే అవుతాము. ఈ వయసులో పైపై అందాలకు మోజుపడి "ప్రేమ....దోమ"ని తెలియని ఆర్భాటంతో తపించుకు పోతారే కాని ఎదటి వ్యక్తి మనస్సులు ఎలాంటివో తెలుసుకొనికి ప్రయత్నించరు. అందుకే ప్రేమ గుడ్డిదంటాను." అని చెప్తోన్న లలితకు "పోస్ట్" అన్న కేక విని చిన్నగ విసుక్కుంటు బయటకు వెళ్ళితన పేరున వచ్చిన కవరువిప్పి చదివి ఒక్కసారిగ స్తంభించిపోయింది. తనకు ఇలాంటి లెటర్ రావటం అనేది అసంభవం అనుకుంటు అడ్రసును పరీక్షగా చూసింది. కాని అడ్రసులో ఎలాంటి పొరపాటు లేదనుకుంటు చిన్నగ నిట్టూర్చి ఆ లెటర్‌ను ప్రేక్షకురాలిగా మిగిలిపోయిన నిర్మలకు ఇచ్చింది.

అది పూర్తిగా చదివిన నిర్మల సంభ్రమాశ్చర్యాలతో లలిత పైపు చూస్తు "నీవు కథలు వ్రాస్తుంటావని నాకు ఇప్పటివరకు తెలియదు. నీ కథ పత్రికలో పడుతున్నందుకు హార్దికం గ్రాచ్యులేషన్స్" సంతోషంగా అంది.

లలిత ముభావంగా తల అడ్డంగా తిప్పుతూ "లేదు నిర్మలా! నేను కథలు వ్రాసి ఏ పత్రికకూ పంపించలేదు. ఇలా ఈ వింత సంఘటన నాకూ చాల ఆశ్చర్యంగా ఉంది" అంది నెమ్మదిగా.

నిర్మల మరింత ఆశ్చర్యగా, వింతగా నమ్మలేనట్లు చూచింది లలితపైపు.

* * *

పై సంఘటన జరిగిన కొద్ది రోజులలోనే తన పేరున నిజంగానే కథపడడం చూసిన లలిత విభ్రాంతి చెందింది! ఆలోచనల వేటలో అలసటచెందిన మనస్సును నెమ్మది పరచి పారితోషికంగా వచ్చిన డబ్బును తీసుకుంది. మరికొన్ని రోజులలోనే మరొక పత్రిక నుండి తన కథను ప్రచురించబోతున్నట్లుగా ఎడిటర్ వ్రాసిన లెటర్‌నుచూసి క్షణకాలం ఏదో అయిపోయింది!

'పత్రికలకు కథలు తన పేరున ఎవరు, ఎందుకు పంపిస్తున్నారో' నని ఆలోచించి, ఆలోచించి ఆమె అలసిపోయింది.

* * *

"లలితా! నీవు వ్రాసిన నవలకు మొదటి బహుమతి వచ్చింది. నీ ఫోటో వివరాలన్నీ తెలియజేయమంటూ పత్రిక వాళ్ళు లెటర్ వ్రాశారు." అంటూ తన చేతిలోవున్న లెటర్ లలితకు ఇచ్చాడు అమితానందంగా! ఆమె అన్నవినోద్.

లలిత ఈ వింత సంఘటనకు లిప్త కాలంపాటు నివ్వెరబోయింది!

'తను రచయిత్రిగా పేరు ప్రతిష్ఠలు పొందాలని ఎవరు కోరుకుంటున్నారు?

ఎందుకిలా జరుగుతుంది ?'

వినోద్ విస్ఫారిత నేత్రాలతో లలితను చూస్తు "ఈ విషయం తెలిస్తే సంతోషంతో ఎగిరి గంతేస్తావనుకున్నాను కాని ఇలా ఆలోచనతో శిలా ప్రతిమ వయ్యావేమిటి ?" వింతగ అడిగాడు

వెంటనే "నేనా నవలను వ్రాసివుండ లేదని గ్రహించాలి " అంటూ నవ్వలేక నవ్వేసింది. లలిత.

ఆశ్చర్యంతో స్తబ్దుడైనాడు వినోద్ !

* * *

లలిత ఎంత వారించినా వినకుండా ఆమె ఫోటోను,వివరాలను తెలియజేస్తు పోస్టుచేశాడు వినోద్.

"చూడు లలిత ! ఈ నవలను నీవు వ్రాయకపోతే మరెవ్వరైనా వ్రాసి తమ కీర్తి ప్రతిష్ఠలను దానం చేసుకోలేరు" వాదన ధోరణిలో అంటూ తిరిగి "మమ్మల్నందరిని ఒక్కసారిగ ఆశ్చర్యంలో ముంచివేయవచ్చునని నీ ప్లాను! అవునా? అంటూ అడిగాడు.

తను ఏం చెప్పినా నమ్మలేని తల్లిని అన్నయ్యను చూస్తు జవాబివ్వలేని నిస్సహాయతలో మౌనం వహించింది లలిత !

* * *

పత్రికలో ప్రచురిత మౌతున్న 'మనసు-మనిషి' నవల పాఠకుల మన్ననలను పొంది లలితకు మంచి పేరును తెచ్చింది.

వివిధ పత్రికలనుండి తన రచనలను పంపమని కోరుతూ వ్రాసిన లెటర్స్‌కు జవాబివ్వకముందే తిరిగి ఆ పత్రికల నుండి వచ్చిన లెటర్స్‌ను చూసి మతి పోగొట్టుకుంది. "మేము కోరిన వెంటనే లేదనకుండా మీరు పంపిన రచనలను చూసి ఎంతో సంతోషించాం." అంటూ ఎడిటర్స్ తమ సంతోషాన్ని వ్యక్త పరుస్తూ వ్రాసారు.

సభలకు సమావేశాలకు హాజరు కావలసిందంటూ కోరే ముఖ్యులకు చమత్కారంగా జవాబులిచ్చి నెమ్మదిగా తప్పించుకునేది. వినోద్ వెళ్ళమని ప్రోత్సహిస్తుంటే అతనిపై మండి పడుతు "ఎవరో ఎందుకో నా పేరున కథలు వ్రాసి పంపిస్తున్నంత మాత్రాన నేనో పెద్ద రచయిత్రినని ఊరేగమంటావా ?" అనేది.

* * *

వినోద్ ఎంత ఆత్రుతతో వచ్చాడో అంత వేగంగా లలితను దగ్గరలో వున్న ఒక ఇంట్లోకి తీసుకు వెళ్ళాడు. తల్లి సావిత్రి కూడా వెళ్ళింది.

ఆ గదిలో దృశ్యాన్ని చూసిన లలిత చలనం లేని బొమ్మై అయింది.

వినోద్ అక్కడే మంచంమీద చావు బ్రతుకుల మధ్యనున్న ముసలాయన్ని చూసి "లలితా ! ఈయన ఎవరో కాదమ్మా! నీ కన్నతండ్రి" అని చెప్పగానే తన నెవరో అగాధంలోకి త్రోసి

వేస్తున్నట్లుగా భయంతో కంపించి పోయింది లలిత

"ఈ కథ నంతటిని తరువాత విందువు గాని ముందు ఆయన కడసారి చూపులకు తావివ్వు." అంటూ వుండగానే లలిత బిక్కుబిక్కుమని తన తండ్రి అని వినోద్ చెప్తున్న ఆ ఆగంతకుడి కాళ్ళ వారగా కూర్చొని అతని కళ్ళలోకి చూసింది....

అనామకుడు "అమ్మా! వచ్చావా"... అంటూ ఆమె తల ఆప్యాయతతో నిమురుతూ ఉండగా దగ్గు విపరీతంగా రాగా పెళ్ల పెళ్లన దగుతూనే వెనక్కు విరుచుకు పడిపోయాడు. అప్పుడు కలిగింది లలితలో చలనం!

రక్త సంబంధం అంటే అదేనేమో అనిపించింది వినోద్‌కు ఆ క్షణాలలో!

తనని ఎవరో పిలుస్తున్నట్లు లీలగ వినిపించటంతో కళ్ళు తెరవాలని ఎంత ప్రయత్నించినా అది అతనికి చేత కాకుండా వుంది. నీలితెరలు వంటి నీడలు కళ్ళముందు వక్రంగా గోచరిస్తున్నట్లున్నాయి! అతి కష్టంమీద కళ్ళు తెరిచి చూశాడు. "నీతండ్రి చావు చూడటానికి వచ్చావా తల్లి"అన్నట్లుగా అతని కళ్ళు మెరిశాయి! అంతే! అతనిలోని జీవం అంతులేని ఆ గగన మార్గంలోకి ఎగిరిపోయింది.

లలిత ఆయోమయంగా ఏడ్చింది.

వినోద్ తన కర్తవ్యాన్ని గురించి నెమ్మదిగా బయటకు వెళ్ళాడు.

* * *

"ఒంటరిగా చీకటిలో కూర్చున్నావేం లలిత!" అంటూ లైట్ వేసింది సావిత్రమ్మ.

లలిత కళ్ళల్లో కన్నీళ్ళు గిర్రున తిరిగాయి. "అమ్మా!" అంది బాధగా

"ఏం తల్లీ"అంటూ క్షణకాలం ఆగి, "నీ గురించి పూర్తిగా తెలుసుకోవాలని వుందా?" కూతురు తల నిమురుతూ అడిగింది.

సావిత్రమ్మ గారి మదిలో గత స్మృతులు సుడిగుండంలా తిరిగాయి.

"చిన్నప్పటినుండి మీ అమ్మ ప్రమీల నేను ఆత్మీయులులా కలిసి మెలిసి తిరిగే వాళ్ళం! నేను స్కూల్ ఫైనల్‌తో ఆపు చేసి దాంపత్య జీవితంలో అడుగు పెట్టాను. ప్రమీల బి. ఎ పూర్తి చేస్తు సురేశ్ అనే అతనిని ప్రేమించి చిలిపి కోర్కెలకు బలహీనురాలై పెళ్ళి కాకుండానే తల్లి అయ్యింది! సురేశ్ మంచి మనసుగలవాడు కావటంతో తల్లిదండ్రులను ఎదిరించి ప్రమీలను పెళ్ళిచేసుకున్నాడు కాని విధి వారిపై పగబూనింది. రైలు ప్రమాదంలో సురేశ్ చనిపోయాడని విచారించి ఎక్కడకు వెళ్ళలేక నిస్సహాయతతో నా దగ్గరకువచ్చి జరిగిందంతా క్లుప్తంగా చెప్పింది. అప్పటివరకు ఆమె విషయం నాకు ఏమీ తెలియలేదు. ప్రమీలకు

అప్పటికే నెలలు నిండటంతో నా అవ రణలోనే నిన్ను కని ఆమె శాశ్వతంగా ఈ లోకం నుండి వెళ్ళిపోయింది. అప్పటి నుండి నీవు నా కూతురివే" అంటూ అప్రయత్నంగా కన్నీరు కార్చింది.

లలిత ఆలోచనా స్థితిని కోల్పోయి వింటుంది అప్పటివరకు గుమ్మం దగ్గర నించుని ఇదంతా వింటున్న వినోద్ అక్కడకు వచ్చి "మిగిలినది నేను పూర్తిచేస్తాను" అంటూ అక్కడ వున్న కుర్చీలో ఆశీనుడయ్యాడు.

"రైలు ప్రమాదంలో చనిపోయా రనుకున్న బాబాయ్ తిరిగి బ్రతికారు. భార్యకోసం ఊరూరు తిరిగి నిరాశ చెందారు. మూడు నెలల క్రిందట నిన్ను చూసి తన భార్య రూపు రేఖలు నీ‌లో కనిపించటంతో అనుమానంతో నన్ను పిలిపించి వివరాలు అడిగారు. అప్పుడే తన కథ నంతటినీ నాతో చెప్పి కంటతడి పెట్టారు. ఈ విషయం అమ్మతో చెప్పి పూర్తివివరాలు తెలుసుకొని ఆయనతో చెప్పాను. భార్య చనిపోయిం దన్న విచారంలోను నీవు తన కూతురే నని తెలిసి ఎంతో మురిసి పోయారు. ఈ విషయం నీతో చెప్తానంటేవద్దన్నారు. కారణం తెలుసుకోగా 'తనకు కేన్సర్' అంటూ 'ఇంకెన్నో రోజులు నేను బ్రతకలేను. ఈ విషయం లలితకు తెలిస్తే మరింత దుఃఖితురాలౌతుందిక. అని చెప్పగా నేను మాన్పడి పోయాను. అంటూ లిప్తకాలం ఆగి లలిత కళ్ళల్లోకి చూస్తూ "నీ పేరున కథలు పంపేది మీ నాన్నగారే!" అని చెప్పగానే లలిత కళ్ళు ఆశ్చర్యంతో వింతగా మెరిశాయి!

"ఈ విషయం నాకు తరువాత తెలిసింది! బాబాయ్ గతాన్ని మరిచిపోలే" కథలు, నవలలు వ్రాస్తు కొంతకాలాన్ని మరిచిపోగలిగేవారట. కాని పత్రికలకు ఎప్పుడు పంపించలేదట. తను చనిపోయే ముందు ఈ విధంగానైనా నిన్ను సంతోష పెట్టాలనే కోర్కెతో ఇలా చేశారు" అని చెప్పటం పూర్తి చెస్తు తిరిగి "తన బీరువాలో ఎన్నో కథలు, నవలలు తను వ్రాసినవి వున్నాయని అవి నీ పేరుతో ప్రచురిస్తూ, నువ్వొక రచయిత్రిగా పేరు ప్రతిష్ఠలు పొందాలని నేను కోరుకుంటున్నానని నీతో చెప్పమన్నారు" అంటూ లలిత వైపు చూశాడు వినోద్.

లలిత కిటికీలో నుండి చూస్తూ మౌనంగా వుండిపోయింది. కళ్ళలోంచి కన్నీరు నును బుగ్గలపైనుంచి జారి, జాలుగా పోసాగినవి.

●